## బీఆర్‌ఎస్ పాలనలో దివ్యాంగులకు భరోసా..

### ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నర్సింగరావు

### బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న దివ్యాంగ నాయకులు

పరకాల, నవంబర్ 2 : బీఆర్‌ఎస్ పాలనలోనే దివ్యాంగుల జీవితాలకు భరోసా కలిగిందని, రానున్న ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక( ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లాసాని నర్సింగరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డి విజయం సాధించడంతో పాటు కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలంటూ మండలంలోని మల్లక్కపేట శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో దివ్యాంగులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివ్యాంగులంతా బీఆర్‌ఎస్‌కే అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూదమల్ల ప్రశాంత్, బొల్లా రం సంజీవ, గూడ కొమురయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట


జిల్లా నాయకులు రామస్వామి

దామెర, నవంబర్ 2 : రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పెద్దపీట వేసి, అండగా నిలిచారని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, రైతుబంధు సమితి మండల సభ్యుడు ముప్పు రామస్వామి అన్నారు. గురువారం మండలంలోని ఊరుగొండ రైతు వేదిక వద్ద ఊరుగొండ, దుర్గంపేట, దమ్మన్నపేట, సీతారాంపురం గ్రామాలకు చెందిన రైతు బంధు సమితి కన్వీనర్లు, కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి భారీ మెజార్టీ ఇచ్చేందుకు ఈ నెల 5న ఊరుగొండలో రైతులతో కలిసి క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులందరూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సిలివేరు నర్సయ్య, దుబాసి రమేశ్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో సామాజిక తనిఖీ సభలు

దామెర, నవంబర్ 2 : మండలంలోని కోగిల్వాయి, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, పులుకుర్తి, పసరగొండ, ఊరుగొండ, ఓగ్లాపురం, తక్కళ్లపహాడ్, దామెర, ల్యాదెళ్ల గ్రామాల్లో ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీలు గురువారం జరిగాయి. సామాజిక తనిఖీ బృందాల సభ్యులు సీసీ రోడ్లు, వరద కాల్వలు, ఫీడర్ కాల్వలు, నర్సరీల్లో జరిగిన పనులు పరిశీలించారు. అనంతరం గ్రామ సభల్లో పనుల నాణ్యతను తెలియజేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాల్లో ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఏపీవో శారద, ఎస్సార్పీలు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహనాలు తనిఖీ


కటాక్షపురం వద్ద తనిఖీ చేస్తున్న డీసీపీ రవీందర్

ఆత్మకూరు, నవంబర్ 2 : ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కటాక్షపురం వద్ద ఏర్పాటు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును గురువారం రాత్రి ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తనిఖీ చేశారు. కేంద్ర బలగాలతో కలిసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ రవీందర్ మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూతగాదాలో వ్యక్తిపై దాడి

నడికూడ, నవంబర్ 2: మండలంలోని ముస్త్యాలపల్లిలో భూతగాదా విషయంలో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బందెల స్వామి, విష్ణు, రాములు అన్నదమ్ములు. గురువారం వ్యవసాయ బావి వద్ద నీరు పారించుకునే విషయంలో స్వామి, విష్ణులు తమ్ముడు రాములుతో గొడవ పడ్డారు. దీంతో రాములు పారిపోయి ఇంటికి రాగా, అక్కడికి వచ్చి మరీ అతడిపై దాడికి దిగారు. స్థానికుల సమాచారంతో ఎస్సై రమేశ్ నాయక్ సిబ్బందితో వెళ్లగా అప్పటికే పారిపోయారు. దాడిలో రాములుతో పాటు అతడి భార్య మంజుల, కుమారుడికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పరకాల దవాఖానకు తరలించారు. కాగా, దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై తెలిపారు.

# బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దే
- ఆయన సీఎం అయితేనే మరింత అభివృద్ధి
- పరకాలలో లక్ష మెజార్టీతో గెలిపించాలి
- సొంత ఊరిని అభివృద్ధి చేసుకోలేని రేవూరి
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


పరకాల : పోచారం గ్రామంలో చిన్నారిని పలుకరిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి


నడికూడ : నార్లాపూర్‌లో ప్రచార రథంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, నవంబర్ 2 : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కామారెడ్డిపల్లి, అలియాబాద్, పోచారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు బతుకమ్మ, బోనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశానికే మార్గదర్శకంగా మారిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంతో రాష్ట్రంలో పంటల దిగుబడులు గణనీయంగా పెరిగిందన్నారు. దేశానికే అన్నంపెట్టే స్థితిలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా రాజకీయాలకతీతంగా అర్హులకు అందుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ అండతో పల్లెల రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, లింకు రోడ్లు, రైతు వేదికలు, జీపీ కార్యాలయాలు, మహిళా భవనాలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు.ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ నాయకులు తెలంగాణ గడ్డను దోచుకున్నారన్నారు. తెలంగాణపై విషం కక్కుతూ మతం పేరుతో బీజేపీ నాయకులు రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గ్యారెంటీ లేని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో, ఓటు బ్యాంకు లేని బీజేపీ ఈసీ కార్డులో ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. పరకాల కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి తన సొంత ఊరినే అభివృద్ధి చేసుకోలేని దద్దమ్మ అని అన్నారు. ఇక పరకాలను ఎలా అభివృద్ధి చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. నర్సంపేటలో ఓడి పోయిన తర్వాత అక్కడి ప్రజలు, శ్రేణులను పట్టించుకోక వరంగల్ పశ్చిమకు పారిపోయాడన్నారు. అక్కడ ఓడిపోయిన తర్వాత స్వలాభం కోసం పార్టీ మారి పరకాలకు వచ్చి అభివృద్ధి అంటూ ప్రజలను మభ్య పెడుతున్నాడని విమర్శించారు. కాగా, బీజేపీ దేశంలోని పేద ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. పరకాల నియోజకవర్గంలో గ్రామాలే తెలియని కొత్త వ్యక్తి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడన్నారు. ఆ పార్టీకి డిపాజిట్ రాకుండా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్‌ఎస్సే శ్రీరామ రక్ష అని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇప్పటికే చాలా వరకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో అందాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. పరకాలలో లక్ష ఓట్ల మెజార్టీతో నన్ను గెలిపించి సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలని చల్లా కోరారు. కార్యక్రమంలో పలు మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నడికూడ మండలంలో..**

నడికూడ : నియోజక వర్గ ప్రజలే తన బలం, బలగం అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామం నుంచి ప్రచార కార్యక్రమాలను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు ఎమ్మెల్యేకు హారతి ఇచ్చారు. బతుకమ్మలను పేర్చి , కోలాటాలు, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చల్లా నాయకులు, ప్రజలు, కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అలాగే, నార్లాపూర్, చర్లపల్లి గ్రామాల్లో కూడా పర్యటించి ప్రచారాన్ని కొనసాగించారు. ప్రజలు చూపిస్తున్న అపూర్వ అభిమానాన్ని చూసి ఇది విజయోత్సవ ర్యాలీగా ఉందంటూ ఎమ్మెల్యే చాలా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, జడ్పీటీసీ కోడెపాక సుమలత, సర్పంచ్‌లు శనిగరపు నీల, వంగ లక్ష్మి రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతిరెడ్డి, నందికొండ జయపాల్‌రెడ్డి, మచ్చ రవీందర్, కోడెపాక కరుణాకర్, తిప్పర్తి సాంబశివారెడ్డి, చందా కుమారస్వామి, భీముడి నాగిరెడ్డి, పర్నెం తిరుపతి, బొల్లె భిక్షపతి, గోల్కొండ సదానందం, సర్పంచ్‌లు ఊర రవీందర్ రావు, గూడెం కృష్ణమూర్తి, రేకుల సతీశ్, పాలకుర్తి సదానందం, సాధు నిర్మలా సమ్మిరెడ్డి, రావుల సరితా రాజిరెడ్డి, పెండ్లి రాజు, మండల యూత్ అధ్యక్షుడు బొల్లారం అనిల్, కార్యదర్శి సురాబు శ్రీకాంత్, ఏఎంసీ డైరెక్టర్ పోచంపల్లి రఘుపతి, తిప్పర్తి ప్రశాంత్ రెడ్డి, దోమ పవన్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు

### మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం

గీసుగొండ, నవంబర్ 02 : తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సదానందం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశ ప్రజలను ఆకర్షించాయన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేసిన అభివృద్ధిని వివరించి, ఓట్లు వేయాలని కోరాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలి రాజయ్య, నాయకులు కిశోర్‌కుమార్, రాజు, మిద్దెపాక విజయ్, లవ్‌రాజు, శ్రవన్‌కుమార్, నవీన్, నాగరాజు, ఉజ్వల్‌కుమార్, సందీప్ పాల్గొన్నారు.

**16వ డివిజన్‌లో ర్యాలీ**

గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు సుంకరి శివకుమార్ మాట్లాడుతూ విలీన గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీలకు స్థానం లేదన్నారు. పరకాలను అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డే అన్నారు. ఆయనకే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. ర్యాలీలో స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జై బీఆర్‌ఎస్, జై కేసీఆర్, జైజై చల్లా అంటూ నినాదాలు చేశారు.


మొగిలిచెర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న చింతం సదానందం


ధర్మారంలో జరిగిన బీఆర్‌ఎస్ ర్యాలీలో పాల్గొన్న డివిజన్ నాయకుడు సుంకరి శివకుమార్

## నేడు ఐదు గ్రామాల్లో ఎమ్మెల్యే చల్లా ప్రచారం

గీసుగొండ, నవంబర్ 2 : మండలంలోని ఐదు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు జడ్పీటీసీ పోలీసు ధర్మారావు తెలిపారు. ఉదయం 6 గంటలకు కొమ్మాల, సూర్యతండా, 7 గంటలకు విశ్వనాథపురం, 8 గంటలకు నందనాయక్‌తండా, దస్రుతండా గ్రామాల్లో ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ముఖ్యనాయకులు, గ్రామ స్థాయి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## నేటి నుంచి నామినేషన్లు షురూ

పరకాల, నవంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరకాల ఆర్డీవో కే శ్రీనివాస్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. శుక్రవారం నుంచి 10 తేదీ వరకు నామినేషన్ల ప్రకియ కొనసాగనుంది. నామినేషన్ ఫారాలు తీకెళ్లడంతో పాటు నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను తీర్చేందుకు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. రోజు (పబ్లిక్ హాలిడేలను మినహాయించి) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.